

# పెన్షన్ ఫోటో

ఎ.బి. సుందరరావు

సత్యంగారు పెంకు లెగిరిపోయేలా ఫెళ్ళున నవ్వేరు. ఆ నవ్వులో ఎంతో హుందాతనం_కొంటెతనం _నిండుతనం సమపాళ్ళలో మేళవించేయి. ఆ నవ్వుకి ఆయన బుంగమీసాలు వెండిలా మెరిసేయి. బుగ్గలు బూరెలయాయి. ఆ నవ్వులో ఆయన కుడిచెయ్యి కూడా పాలుపంచుకునే సంరంభంలో అనుకోకుండా పైకి లేచి భార్య కాంతమ్మ వెన్నుమీద అలవోకగా చరిచింది. ఆ సుతిమెత్తని చరుపువల్లో- ఆయన నవ్విన తీరును చూసో, లేక బంధుమిత్ర సపరివార సమక్షంలో _ కిటకిట లాడుతున్న పెండ్లి పందిరిలో-నలుగురు మధ్యా అలా జరిగినందుకో, కాంతమ్మ సిగ్గుతో కుంచుకుపోయి కంచిపట్టుచీరను భుజాల మీదకు నిండుగా లాక్కు-ని సత్యంగార్ని అతుక్కు-పోయింది. సత్యంగారు ఇంకా నవ్వుతూనే వున్నారు. కాంతమ్మ మొహంలో ముసిముసి నవ్వులు దోబూచులాడుతున్నాయి. ఇద్దరి కళ్ళూ 'జిగేల్మని' మెరిసేయి. వధూవరులు సహితం పెండ్లి పందిరంతా నవ్వులతో కలకలలాడుతూ గోలగా తయారయింది.

నిజానికి అంత పెళ్ళిపందిరిలోనూ ఆయన నవ్వుని సరిగ్గా అర్థంచేసుకున్నది

తానొక్కర్తే. మిగతా వారందర్నీ నవ్వించింది. బహుశా ఆయన నవ్విన తీరును చూసో-తను పడుతున్న అవస్థను చూసో-

సంగతేంటంటే ఆయన ఒట్టి 'మొండి' అన్న సంగతి తెలిసీ కూడా తనే అనవసరంగా రెచ్చగొట్టింది. ఉత్సుకత చంపుకోలేక ఎవరూ చూడకుండా మోచేత్తో ఆయన పక్కలో సుతారంగా పొడిచింది. ఎదురుగా ఫొటోకి పోజిస్తున్న 'వధూవరులను-చూడండి'..అన్నట్టు-,

మోచేతి దెబ్బ- 'అర్థం అయింది'.... అన్నట్టు ఆయన నవ్వడం జరిగింది.

ఇలాంటి సంఘటనలు తమ ఇద్దరికీ కొత్త కాదు. అనేక సందర్భాల్లో కొన్ని వందల సార్లు ఇలా జరిగేయి. ఆ అలవాటు వల్ల ఈసారీ ఇలాగే అయింది. ఫలితం-అందరి ముందూ నవ్వుల పాలయింది.

సత్యంగారి నవ్వుకి శాంతమ్మ భాష్యం చెప్పగలదు.

....'ఓహో మరిచిపోయినట్టుందీ- ఇంకా ఎంచేత జ్ఞాపకం చెయ్యలేదు చెప్మా అని అనుకుంటున్నాను....ఇంత లోనే జ్ఞాపకం చేసావు'-అనో!

....'నీకీ అలవాటు పోయింది కాదు'....అనో!

....'చూద్దాం! అదేమంత పని'.... అన్నట్టుగానో వుంటుంది ఆ నవ్వుకి అర్థం.

భర్తతో కలిసి విందులకీ వివాహాలకీ- పండగలకీ బంధుమిత్రుల గృహాలకీ- ఈ ముప్ఫయ్అయిదేళ్ళ సంసారజీవితం లోనూ చాలాసార్లు వెళ్ళడం జరిగింది. ఎవరింటికి వెళ్ళినా ఎదురుగుండా గోడ మీదనో- రేడియో బల్లమీదనో- ముచ్చటగా అందంగా కనిపించే ఆయా దంపతుల పెండ్లి ఫొటో కానవచ్చేది. వధూవరు లిరువురూ నిండుగా పూలదండలూ- కర్పూరప్పేర్లూ ధరించి వధువు కళ్యాణ తిలకం దిద్దుకుని-వరుని చిటికిన వేలు అంటీ ముట్టనట్టుగా-బిడియపడుతూ పట్టుకుని ఇద్దరూ చిలకాగోరింకల్లా వుండగా ఆ మధురక్షణాన్ని శాశ్వతంగా ఫొటోలో బంధించిన తీరుని చూస్తూ అలాగే వుండిపోయేది తను.

అలాంటి ఫొటోను చూసినపుడుగాని- చక్కని గిల్టు ఫ్రేములో భార్యాభర్తలు ఫొటోలు చూసినపుడు గాని ఆమెకు ఒక విధమైన ఉద్వేగము కలిగేది. ఎవరూ చూడకుండా మోచేత్తో సుతారంగా ఆయన పక్కలో పొడిచేది. 'చూసారా మనకంటే నయం' అంటూ కళ్ళతోనే చెప్పిపొడిచేది. ఆ ఫొటోను ఆయన దృష్టికి తీసుకురావడానికి నానా పాట్లు పడేది.. ఆయన చిరునవ్వుతో తన ఆవేదనను నిర్లక్ష్యం చేసేవారు.

....'ఫోటో తీయించుకోడమూ ఒక గొప్పా?.... తీయించుకుంటే పోలే....?' అన్నట్టు.

తను మాత్రం ఆ దంపతుల అదృష్టాన్ని మెచ్చుకుంటూ తన తీరని కోరిక పదేపదే తలచుకుంటూ బాధ పడేది.

తమ వివాహం అన్ని విధాలా బాగా జరిగినా అన్నీ అమిరినా, ఆ రోజు లే వేరు_ ఆ గొప్ప అదృష్టానికి మాత్రం తను నోచుకోలేకపోయింది. అప్పట్లో అన్ని సదుపాయాలు వుండేవి కావు. అదీ కాక తమ వివాహం ఎక్కడో మారు మూల గ్రామంలో మిన్నులుపడ్డ చోటున జరిగింది. ఫొటోగ్రాఫర్ని దూరంగా వున్న 'సిటీ' నుంచి తీసుకురావడం అన్నది కాస్త వ్యయంతో...కూడిన పని. పైగా ఆ కాలంలో ఫొటో తీయించు కోడం 'అయుక్షీణం' అనేవారు. పోనీ ఆ తర్వాతేనా పట్నం వెళ్ళినప్పుడు తీయించుకుంటే బాగుండును అని చాలా సార్లు అనుకుంది. ఆయనతో ప్రతి పాదించడం_ఆయన 'సరే' అనడం. ఇంతలో నెల తప్పడం_ తర్వాత పురుడూ_పుణ్యం_చేతిపిల్ల _ వచ్చేపోయే వారికి చాకిరీ_ఇంటినిండా బోలెడు పని. తీరా ఎప్పుడేనా అవకాశం రావడం భయం ఇంతలోనే ఏదో అవాంతరం వచ్చి పడేది. ఏమయితే ఏం ? ఆ ముచ్చట ఏదో విధంగా తీరకుండానే ఇంత కాలం జరగిపోయింది. ఆ చింత మాత్రం తనని అంటిపెట్టుకుని వుండిపోయింది. తీరని కోరికగా మిగిలింది.

ఎవరింట్లో పెళ్ళి ఫొటో చూసినా కాస్త ముచ్చటేస్తుంది. పాతకాలం ఫొటోలకీ ఇప్పటి ఫొటోలకీ చాలా వ్యత్యాసం వుంది. అన్నిటిలో లాగే వాటిలో కూడా క్రమేపీ మార్పులు వచ్చాయి.

తన తాతగారినాటి ఫోటో ఇప్పటికీ తన దగ్గిర వుంది. ఆయన నల్లని చెమ్కీటోపీ ధరించి_నొసటన అంగారు బొట్టు_నల్లటి కోటుమీద అడ్డుగా వేసు కున్న జరీ వాణీ_బొత్తాంనుంచి వేలాడు తున్న చిన్న దంతపు ఏనుగ_ కోటు జేబులో జారిన గడియారం గొలుసూ_ తెల్లని పంచెకు నల్లని నడుం బెల్టు_ కాళ్ళకి లేసుల్లేని సగం బూట్లు ధరించి_ నగిషీలు చెక్కిన పాతకాలపు కుర్చీమీద సింహాసనం మీద కూర్చున్నట్టు ఆశీనుడు కాగా.... ఇహ అమ్మమ్మ (పాపం !) వడ్డికాసులవాడిలాగ కాసుల పేరు_ కంటె_ దండవంకీలూ_ నత్తులూ_ తమ్మెట్లూ_ గాజులూ_ అవి చాలవన్నట్టు బంగారు మువ్వల వడ్డాణం_బరువైన కడియాలూ మోస్తూ సాక్షాత్తూ లక్ష్మీదేవిలా వుంది.

తన తండ్రిగారి టయిములో అమ్మా నాన్నా కలిసి తీయించుకున్న ఫొటో మరొకటి వుంది. ఆభరణాలు పెద్దగా లేకపోయినా_అమ్మ కుర్చీలో కూర్చుంది. నాన్న ఠీవిగా ఆమె పక్కన కుర్చీ నాను కుని నించున్నారు.

నిజానికి ఇంతవరకూ ఆయన చేసిన ఖర్చులు చూస్తే అవసరమైన వాటికంటే అనవసర ఖర్చులే ఎక్కువున్నాయి. అన్నీ అర్థంపర్థం లేని ఖర్చులు. తన వుద్దేశం భర్తని విమర్శించడం కాక పోయినా.... ఇన్ని అనవసర ఖర్చుల్లో ఇదీ ఒకటనుకుంటే ఈ సరికి అందరిలాగే తమ ఇద్దరి ఫొటో కూడా— అందంగా గోడమీదనో.... టేబిల్ మీదనో ముచ్చట్టగా అమిరివుండేది. తన ముద్దూముచ్చటా తీరడానికి ఆయన్ని పదిసార్లు వేదించి పొందేకంటే—ఆయ నంతట ఆయనే తీరుస్తే అందులో ఒక విధమైన సంతృప్తి వుండేది. అందుకనే మరి తనతో ఆ వూసు ఎత్తలేదు.

మనసులో ఆరాటం ఆత్మీయులకి చెప్పుకుంటే కాస్త ఊరట వుంటుం దంటారు. అయినా .... ఈ తన చిన్న కోరికను ఎవరితో చెప్పడానికేనా .... సిగ్గుగావుంటుంది. పైగా నవ్వుకుంటారు కూడానూ.

• • •

రోజులా కాకుండా ఆ సాయంత్రం సత్యంగారు ఆఫీసు నుంచి త్వరగానే ఇంటి కొచ్చారు. సాధారణంగా సాయంత్రం అయిదవగానే అందరిలాగా కాకుండా మరో అరగంట సేపు ఆఫీసులో కూర్చుని—కాగితాలు చూస్తూ ఆ తర్వాత ఆఫీసు వదిలేవారు. నాయరు హోటల్లో ఒక కప్పు టీ తాగి—దారిలో తెల్సిన మొహాల్ని పలకరిస్తూ శంకర మఠం దగ్గిర ఆగి ఆనాటి కార్యక్రమాలు తెలుసుకుని బుద్ధిపుడితే— వేదాంత రహస్యం—పారమార్థిక చింతవంటి ఉప న్యాసాలు విని— ఏ ఎనిమిది గంటలకో ఇల్లు చేరడం పరిపాటి.

సరిగ్గా సాయంత్రం అయిదుంపావు కల్లా భర్త ఇల్లుచేరడం శాంతమ్మకి చోద్యం అనిపించింది. తన ఆశ్చర్యాన్ని కనుబొమలు ముడిచి— కళ్ళు చిట్లించి సంగతేంటన్నట్టు వ్యక్తం చేసింది.

"నీ కోరిక చెల్లించుతాను వుడు...." అన్నారు ముక్తసరిగా — సులోచనాలు మడిచి కేసులో పెడుతూ—చిన్నగా నవ్వుతూ సత్యంగారు.

వింతగా చూసింది శాంతమ్మ.

"....వచ్చే నెలలో పదవీ విరమణ చేయబోతున్నాను...అంటే రిటైరు అవుతా నన్నమాట." తెలుగులో అర్థం చెబితే అర్థంకాన్నట్టు బాగా వాడుకలో వున్న ఇంగ్లీషు పదం వాడినందుకు తనలో తానే నవ్వుకుంటూ సత్యంగారు.

శాంతమ్మ విని ఉక్కిరిబిక్కిరి అయింది. ఈయన పెందరాళే ఇల్లు చేరడానికీ— వచ్చే నెలలో రిటైరు అవ డానికీ—తనకోరిక చెల్లించడానికీ—పొందిక లేని మాటలులా వున్నాయి. కాస్త వివ రంగా చెప్పమన్నట్టు మొహం పెట్టింది.

...."ఇంకా అర్థం కాలేదూ? తొరగా ముస్తాబవు. ఇప్పుడు మనం—స్టూడియోకి



వెళ్ళి ఫొటో తీయించుకోవాలి....అర్థం అయిందా?..." కొంటెగా నవ్వేరు సత్యంగారు.

"అర్థం అయింది. వెర్రి కుదిరింది... రోకలి తలకు చుట్టడమే తరువాయి" అంటూ ఎత్తిపొడిచింది.

...."శాంతమ్మా వేళాకోళానికేనా ఒక టయిముండాలి...." అసహనంగా అన్నారు సత్యంగారు.

...."నే నన్నదీ అదేనండీ.... వేళాకోళానికేనా ఒక టయిముండాలి. లేకపోతే ఈ ముప్ఫయ్ అయిదేళ్ళ నుండీ లేని తొందర ఇవాళే వచ్చిందా?...." సాగదీస్తూ అంది.

"చెప్పేనుగా వచ్చే నెలలో రిటైరు అవబోతున్నానని.... పెన్షను గురించి మన ఉభయులం తీయించుకున్న ఫొటో కాపీలు మూడు దాఖలు చెయ్యాలి...." నచ్చజెప్పబోయారు-

"మీరు మరీనండీ. ఇన్నాళ్ళూ ఫొటో వుంటేనేనా మనల్ని లోకం గుర్తించింది? -మనం భార్యాభర్తలమనీ చెప్పుకోడానికి

ఇప్పుడు కావాల్సి వచ్చిందా?....విడ్డూరం కాకపోతే ?"

కీలెరిగి వాత పెడుతోందని గ్రహించడానికి సత్యంగారికి అట్టేసేపు పట్టలేదు.

"సరే! నీ ఇష్టం...." అంటూ ముభావంగా కూర్చుండిపోయారు.

ఇహ ఆయన్ని రెచ్చగొట్టి లాభం లేదనిపించింది శాంతమ్మకి.... రెండు నిముషాలు పోయింతర్వాత కాస్త మెత్తబడింది.

"పోన్లెండి.... అలాగే ఫొటో తీయించుకుందాం!....గానీ ....చెయ్యక చెయ్యక చేసేపనికి కాస్త వారం-వర్జం చూసుకుంటే మంచిదనీ... బొత్తిగా మరీ అష్టమి-నవమీనూ...." నానుస్తూ అంది అనుమానంగా శాంతమ్మ.

"సరే కానీ! మంచి రోజు చూసి చెప్పు!" అంటూ ఆమె ప్రతిపాదనతో ఏకీభవిస్తూ అన్నారు సత్యంగారు.

....'అయ్యవారొచ్చే వరకూ అమావాశ్య ఆగలేదు.... శాంతమ్మ చిరకాల వాంఛ కొడిగట్టిపోయింది.

నెలరోజుల తర్వాత ఎవరో సంక్షేమ అధికారి వచ్చి-పెన్షను కాగితాల మీద ఆమె వేలిముద్రలూ సంతకాలూ తీసుకుంటూ-

...."అమ్మా మీ ఉభయులూ తీయించుకున్న ఫొటో మూడు కాపీలు-ఇప్పిస్తారా....చాలా జరూరు" అన్నాడు శాంతమ్మతో.

శాంతమ్మకి దుఃఖం పెల్లుబికింది.

"ఈ జన్మకా అదృష్టం లేదు బాబూ! ముప్పయ్ అయిదు సంవత్సరాలు వేచి-తీరా వచ్చిన ఒక్క అవకాశం పోగొట్టుకున్నాను-" గద్గదంగా గొణిగింది శాంతమ్మ.

సంక్షేమాధికారి వెళ్ళిపోయాడు.

• • •

"పోస్ట్!"

శాంతమ్మ తలుపు తీసింది.... పోస్టుమాన్ ఆమె చేతులో బరువైన కవరుపెట్టి ఆమె సంతకం తీసుకున్నాడు.

"ఎక్కడ్నుంచి బాబూ!" అంది.... అనుమానంగా.

"భాస్కరం-బొంబాయి," అంటూ పోస్టుమాన్ నిష్క్రమించాడు.

ఓహో మనవడు భాస్కరం రాసాడా? ఇంత బరువుగా వుంది ఏంటి చెప్మా అనుకుంటూ జాగ్రత్తగా కవరు చించింది.

ఒక ఉత్తరం దాంతోపాటు పుస్తకం వున్నాయి.

గూటిలో దాచిన సులోచనాలు తీసి-చెంగుతో అద్దాలు తుడిచి ఆతృతగా చూసింది.

"అమ్మమ్మకి నమస్కారములు.

ఉభయకుశలోపరి.

కొంచెం ఆలస్యం అయింది గానీ తాతయ్యకూడా వుంటే ఎంత సంతోషించేవారో! పుస్తకంలో పేజీలు తిరగెయ్-




నీకే తెలుస్తుంది. ఈ పత్రిక సర్క్యులేషన్ మూడులక్షలు....

నీ మనవడు

—భాస్కరం

"ఏవిటంటాడు వీడూ.... అకుకీ-పోకకీ అందని ఈ వుత్తరం ఏంటి?...." గొణుక్కుంటూ పుస్తకంలో పేజీలు తిప్పసాగింది. మధ్యపేజీ దగ్గర ఆగింది. రంగుల ఫోటో మసగ్గా కనిపించింది. సులోచనాలు తీసి మరోసారి రుద్దింది. అవి పెట్టుకొని- తీసి- దగ్గిరగా- పరిశీలించి చూసింది. చెంగుతో కళ్ళు తుడుచుకుంది- కన్నీళ్ళతో చెంగు తడిసింది. ఈసారి తదేకంగా చూసింది. ఈ వారం ఛాయాచిత్రం శీర్షికలో

....సత్యంగారు పెంకులెగిరేలా- పెళ్ళున నవ్వుతున్నారు. ఆయన బుంగ మీసాలు- బూరెల్లాంటి బుగ్గలూ నిండుతనం ఇస్తున్నాయి. శాంతమ్మ భుజాల మీదకు కంచిపట్టుచీర లాక్కొని ఆయన్ని అతుక్కుపోయి ముసిముసిగా నవ్వుతోంది.

'సజీవంగా మనిషి వున్నన్నాళ్ళూ... ఫోటో గురించి కలవరించాను. తీరా ఫోటో చేతికొచ్చినవేళకి మనిషి కరువయ్యారు....ప్చ్.... దూరమయినప్పుడే విలువలు తెలుస్తాయి కాబోలు-'

"బాబూ!.... మూడు ఫోటోలేంఖర్మ .... ఆ మహారాజు ఫోటో మూడు లక్షల కాపీలు- దేశమంతా ఆయన ఫోటో..." పిచ్చిగా గొణుగుతోంది శాంతమ్మ.